సాక్షి కామారెడ్డి
శనివారం, 27, జనవరి, 2024


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

గరిష్టం/కనిష్టం
30.4 /13.2

వాతావరణం
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు

అభివృద్ధిలో భాగస్వాములవుదాం

- ఆరు గ్యారంటీల అమలుకు సర్కారు కృషి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కలెక్టరేట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాటిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలుకో సం సర్కారు కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల లో ప్రయాణిస్తున్నారన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 27.75 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించారని పేర్కొన్నారు.

'గ్యారంటీ'లకు 2,94,799 దరఖాస్తులు..

గతనెల 28 నుంచి ఈనెల 6 వ తేదీవరకు ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాపాలన కింద జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డులలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించామని, ఆరు గ్యారంటీల కోసం 2,94,799 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వీటితో పాటు ఇతర సమస్యలకు సంబంధించిన 13,367 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతోందని, రైతులకు పంట పెట్టుబడి సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సంబంధించి రూ.2 లక్షలలోపు పంట రుణాన్ని మాఫీ చేయడానికి ప్రభుత్వం బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. సరైన విధానంలో ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు సైతం జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.


ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజలు

ప్రశంసా పత్రాల అందజేత..

విధుల్లో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో చురుగ్గా పనిచేసిన అధికారులతోపాటు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ పాటిల్‌తోపాటు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీ బీబీ పాటిల్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దఫేదార్ శోభ, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎస్పీ సింధు శర్మల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మనుచౌదరి, చంద్రమోహన్, ట్రైనీ ఐపీఎస్ కాజల్ సింగ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందించారు.




విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో జిల్లా మత్స్యకారులు



కామారెడ్డి టౌన్ : ఢిల్లీలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు. కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తం రూపాల, కా మారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సహకారంతో ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు మత్స్యకారులు తెలిపారు.

న్యూస్‌రీల్

29 నుంచి 'పోచారం' రెండో విడత నీటివిడుదల



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి రెండో విడత నీటి విడుదలను ఈనెల 29న ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో 0.937 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఆయకట్టు కింద యాసంగి పంటలసాగు కోసం ఇటీవల మొదటి విడతగా నీటివిడుదలను పూర్తి చేశామన్నారు. ఈనెల 29 నుంచి రెండో విడత నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం పోచారం ప్రధాన కాలువలోని వంతెనల వద్ద పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్: అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 2.22 లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ చేసినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణలో జిల్లాకు అవార్డు



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: ఎయిడ్స్ నివారణకు చేస్తున్న కృషికి జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు వచ్చిందని ఎయిడ్స్ నివారణ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్ తెలిపారు. రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నామని పేర్కొన్నారు.

సామాజిక బాధ్యత, దేశభక్తి ప్రధానం కావాలి



కామారెడ్డి అర్బన్: దేశం మనకేమిచ్చిందని కాకుండా దేశానికి మనం ఏం చేశామన్న సామాజిక బాధ్యత ఉండాలని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెరవే ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి కర్షక్ బీఈడీ కళాశాలలో సామాజిక కవి సమ్మేళనం నిర్వహించారు. పలువురు కవులు దేశభక్తి, సామాజిక సమస్యలు, మారుతున్న విలువలపై కవితాగానం చేశారు. గజల్ కవి సూరారం శంకర్, యెనిశెట్టి గంగాప్రసాద్, అల్లి మోహన్‌రాజ్, కాసర్ల రామచంద్రం, నాగభూషణం, యెంబరి లింగం, మేకల రామస్వామి, తిరుపతి, సుధాకర్, తిరుపతి రావు, డీవీఎస్ శర్మ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్‌కు మూడు ప్రాజెక్టుల ఎంపిక

కామారెడ్డి టౌన్: సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్‌కు జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి సిద్దరాంరెడ్డి శుక్రవారం తెలిపారు. చిన్నమల్లారెడ్డి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ రూపొందించిన 'లర్న్ ఫిజికల్ సైన్స్ విత్ ఫన్ గేమ్స్' ప్రాజెక్టు, కొండాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సింధూజ రూపొందించిన 'డ్రైవింగ్ లైసెన్స్ బెస్ట్ వెహికల్ ఇగ్నీషియన్ సిస్టం ప్రాజెక్టు', ఉప్పల్‌వాయి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ బబ్లూ రూపొందించిన 'స్మార్ట్ హెల్మెట్ సిస్టం' ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 1 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగే ప్రదర్శనలో వీరు పాల్గొంటారని అందులో ఎంపికై తే జాతీయ స్థాయికి అర్హత సాధిస్తారన్నారు. ప్రాజెక్ట్‌ల గైడ్ టీచర్లు అశోక్‌రావు, టి శ్రీనివాస్, విద్యార్థులను అధికారులు అభినందించారు.

వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శనతో మేలు


గడికోటలో ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

దోమకొండ: వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శనతో మేలు జరుగుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. దోమకొండలోని గడికోటలో శుక్రవారం గడికోట ట్రస్ట్, లైఫ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మన సంస్కృతి మేళా'ను ఆయన పరిశీలించి మాట్లాడారు. స్టాళ్లల్లో ఆర్గానిక్, దేశీ ఉత్పత్తులు బాగున్నాయని పేర్కొన్నారు. గానుగ నూనె తయారు చేస్తున్న దోమకొండకు చెందిన ప్రమోద్ రెడ్డిని అభినందించి, నూనె కొనుగోలు చేశారు. సేంద్రియ సాగుతో పండించిన పంటలను పరిశీలించారు. ఆయన వెంట గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ ఉన్నారు.

చిన్ని కృష్ణుడికి అభినందన



ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచి జాతీయ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డు అందుకున్న చిన్నికృష్ణుడిని కలెక్టర్ అభినందించారు. గడికోటలో చిన్ని కృష్ణుడు స్టాల్ ఏర్పాటు చేసి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఆరేళ్లుగా తాను దోమకొండలో ప్రకృతి వ్యవసాయ విధానం గురించి రైతులకు వివరిస్తున్నానన్నారు.

సోమాయప్ప స్వామీజీకి ఘన స్వాగతం

బిచ్కుంద: బిచ్కుందలోని బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామీజీకి భక్తులు ఘన స్వాగతం పలికారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం మేరకు అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన స్వామీజీ శుక్రవారం బిచ్కుందకు తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు భక్తులు బిచ్కుందలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఘనస్వాగతం పలికారు. గ్రామ పెద్దలు మల్లికార్జునప్ప శెట్కార్, భక్తులు ఆయనను సన్మానించారు. చౌరస్తానుంచి మఠం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సోమాయప్ప స్వామీజీ మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ మందిరాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. మందిర నిర్మాణంతో హిందువుల వందల ఏళ్ల కల నెరవేరిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భక్తులంతా అయోధ్యకు వెళ్లి బాలరాముడిని దర్శించుకోవాలని సూచించారు.


ర్యాలీలో పాల్గొన్న సోమాయప్ప స్వామీజీ

రోడ్డు విస్తరణ జరిగేనా..?

- తన ఇంటినుంచే రోడ్డు వెడల్పునకు ఎమ్మెల్యే కేవీఆర్ శ్రీకారం
- పది రోజుల క్రితమే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి షిఫ్ట్
- నేడు ఇంటిని కూల్చివేయనున్న బల్దియా అధికారులు
- ఎమ్మెల్యే నిర్ణయంతో నేతలు, రోడ్డు ఆక్రమణదారుల్లో ఆందోళన


ఇరుకుగా ఉన్న పాతబస్టాండ్ -అడ్లూర్ రోడ్డు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అడ్లూర్ రోడ్‌లో ఉన్న స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇంటిని శనివారం కూల్చివేయనున్నారు. రోడ్డు విస్తరణ పనుల కోసం తన ఇంటిని కూల్చివేయించేందుకు ఆయన స్వచ్ఛందంగా ముందుకు రావడంతో బల్దియా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

వెంకటరమణారెడ్డి తన తండ్రి కాలం నుంచి ఇదే ఇంట్లో నివాసం ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఆ ఇంటిని ఆధునికీకరించారు. అయితే మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ చేపట్టడం కోసం ముందుగా తన ఇంటిని కూల్చివేయించాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. ఇందుకోసం వెయ్యి గజాలకుపైగా స్థలాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. పది రోజుల క్రితమే ఆయన తన ఇంటిని ఖాళీ చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మారారు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి క్యాంపు కార్యాలయంలోనే నివాసం ఉంటున్నారు.

జన్మభూమి రోడ్డు సంగతేంటి?

జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్డు నుంచి జన్మభూమి రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 ఫీట్ల రోడ్డు ఉండాలి. కానీ ఈ రోడ్డు సైతం 30 నుంచి 40 ఫీట్ల వెడల్పు మాత్రమే ఉంది. ఇరువైపులా అక్రమ నిర్మాణాలెన్నో ఉన్నాయి. ఈ మార్గంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి తాతయ్య విఠల్‌రావు ఇల్లు ఉంది. రోడ్డు విస్తరణ విషయంలో ఏడాది క్రితం ప్రస్తుత ఎమ్మెల్యే కేవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తండ్రి నిట్టు వేణుగోపాల్‌రావు మధ్య సవాళ్ల పర్వం నడిచింది. రోడ్డు వెడల్పు కోసం ఇంటిని కూల్చివేయించేందుకు సిద్ధమా అని ఇరువురు నేతలూ అప్పట్లో సవాళ్లు విసురుకున్నారు. అలాగే నిజాంసాగర్ రోడ్‌లో డీసీసీ అధ్యక్షుడి వ్యాపార సముదాయం, బీఆర్ఎస్ కౌన్సిలర్‌కు సంబంధించిన పెట్రోల్ బంక్ ఉన్నాయి. ఇందిరాచౌక్, సిరిసిల్లారోడ్, జన్మభూమి రోడ్లలో చాలామంది నాయకుల ఇళ్లున్నాయి. ప్రస్తుతం అడ్లూర్ రోడ్‌లో ఉన్న తన ఇంటిని కూల్చివేయడానికి ఎమ్మెల్యే స్వచ్ఛందంగా ముందుకు రావడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. ఆయా నాయకులతోపాటు ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రోడ్డు విస్తరణకు సహకరిస్తారా లేదా అన్న విషయమై పట్టణంలో జోరుగా చర్చలు నడుస్తున్నాయి.

ఇళ్ల యజమానులకు నోటీసులు..

మాస్టర్ ప్లాన్ ప్రకారం కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ వరకు 80 ఫీట్ల రోడ్డు ఉండాలి. కానీ ప్రస్తుతం రోడ్డు వెడల్పు 30 నుంచి 40 ఫీట్లు మాత్రమే ఉంది. ఈ మార్గంలో ఎమ్మెల్యే కేవీఆర్ ఇంటితోపాటు మాజీ మంత్రి షబ్బీర్ అలీ నివాసం, రెండు సినిమా థియేటర్లు, రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, గృహాలు ఉన్నాయి. పలుచోట్ల రోడ్డు ఆక్రమణకు గురైంది. అంతేకాక ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ కూడా పెరగడంతో రోడ్డు ఇరుకుగా మారి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రహదారి విస్తరణ పనులు చేపట్టాలన్న డిమాండ్ చాలా ఏళ్లుగా ఉన్నా రాజకీయ కారణాలతో అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఎమ్మెల్యే ముందుకు వచ్చారు. తన ఇంటినుంచే రోడ్డు విస్తరణ ప్రారంభించాలని బల్దియా అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే ఇంటిని కూల్చివేయడానికి బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రోడ్డు విస్తరణ ప్రారంభమైతే మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఇంటిని సైతం కొంత భాగం కూల్చివేయాల్సి ఉంటుంది.

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, అడిషనల్ డీఎంఈ ఇందిర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరంలోని వైద్యకళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. ప్రొఫెసర్-06, అసిస్టెంట్ ప్రొఫెసర్-04, ట్యూటర్-10, సివిల్ అసిస్టెంట్ సర్జన్-16, జూనియర్ రెసిడెంట్-18 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వచ్చేనెల 6న ఉదయం 11 గంటలకు మెడికల్ కళాశాల కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. పోస్టులకు సంబంధించి 7వ తేదీన అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చాంబర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో సుజాత



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు తాడ్వాయి మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుజాత ఎంపికై వేడుకల్లో హాజరైనట్లు ఐకేపి ఏపీఎం రవీందర్ పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

లింగంపేట: లింగంపేటకు చెందిన గొంగళ్ల నర్సింలు 3 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. నర్సింలు లింగంపేట 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నర్సింలు మృతితో భార్య పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు. దాంతో ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. డీఈ గణేష్, ఏఈలు సాయినాథ్, తిరుపతిరెడ్డి, జేఎల్ఎం సాయిరాం, మల్లయ్య, లైన్‌మెన్స్లు ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నస్రుల్లాబాద్: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన ఒల్లెపు శిరీష ఫోన్ ఆరు నెలల క్రితం పోయింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై లావణ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా శుక్రవారం ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితురాలికి అప్పగించారు.

డ్రోన్‌తో మందుల పిచికారిపై అవగాహన




దోమకొండ: పంటలకు డ్రోన్‌తో మందుల పిచికారిపై శుక్రవారం గడికోటలో అవగాహన కల్పించారు. లైఫ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో దీనిని ప్రదర్శించారు. ఎన్‌జీవో ప్రతినిధి బాల ప్రసాద్, గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్ ఉన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న ఫుట్‌బాల్ టోర్నీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఉమెన్స్ ఫుట్‌బాల్ అండర్-13 టోర్నమెంట్ ఉత్సాహంగా శుక్రవారం కొనసాగింది. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. శనివారం సెమీస్ పోటీలను నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి జావిద్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మీర్ ఫారుఖ్, కోచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఆర్మూర్ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం ఎంపికైన విద్యార్థులు వినయ్, అద్యుత్, జ్ఞానంగూర్‌లను ఉపాధ్యాయులు వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు శ్రీధర్, సురేశ్, రాజేందర్, సంజీవ్ అభినందించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

కలెక్టరేట్ ఆవరణలో గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, ఎస్పీ సింధుశర్మ తదితరులు పాల్గొన్నారు. -కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్



ప్రశంసా పత్రాలతో మెడికల్ కళాశాల స్టాఫ్



ఆరోగ్యశ్రీ సిబ్బంది



ప్రశంసా పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, మను చౌదరి

రాజారాం, సీపీవో, కామారెడ్డి ౹ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో, కామారెడ్డి ౹ సాయన్న, డీఆర్‌డీవో ౹ సాయాగౌడ్, జెడ్పీ సీఈవో ౹ దయానంద్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ ౹ సతీష్‌యాదవ్, ఏడీ గ్రౌండ్ వాటర్ ౹ శ్రీనివాస్‌రావు, డీపీవో



ఎస్ రాజు, డీఈవో ౹ బావయ్య, పీడీ, ఐసీడీఎస్ ౹ లక్ష్మణ్‌సింగ్, డీఎంహెచ్‌వో ౹ డి శ్రీనివాస్, బీడీడబ్ల్యూవో ౹ వరదారెడ్డి, ఏడీ, ఫిషరీస్ ౹ రాణి, డీటీవో ౹ భాగ్యలక్ష్మి, డీఏవో ౹ అభిషేక్‌సింగ్, సివిల్ సప్లయ్స్ డీఎం ౹ సింహారావు, జిల్లా పశువైద్యాధికారి ౹ మల్లికార్జున్‌బాబు, డీసీవో ౹ దశరథం, డీపీఆర్‌వో ౹ భార్గవ సుధీర్, ఎల్‌డీఎం



మసూద్ హైమద్, ఏవో, కలెక్టరేట్ ౹ సాయి భుజంగరావు, సూపరింటెండెంట్ ౹ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్, కామారెడ్డి ౹ రామన్, సీఐ, ఎస్ఎస్ నగర్ ౹ నవీన్, కలెక్టర్ సీసీ ౹ నర్సింలు, ఆర్డీవో ఆఫీస్ తహసీల్దార్, కామారెడ్డి ౹ బాలయ్య, జూనియర్ అసిస్టెంట్ ౹ రాజ్‌కుమార్, హెచ్‌హెచ్‌పీ ౹ హరీష్, కలెక్టర్ సీసీ ౹ సోఫియాన్, కలెక్టర్ సీసీ ౹ సంతోష్, అదనపు కలెక్టర్ డ్రైవర్ ౹ డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్ఎస్



చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ, కామారెడ్డి టౌన్ ౹ రాజు, ఏఎస్సై, కామారెడ్డి టౌన్ ౹ పెద్దిరాజు, కానిస్టేబుల్ ౹ రాములు, కానిస్టేబుల్ ౹ సుభాష్, సీఐ, ఏఆర్ ౹ ఉదయ్ శేఖర్, ఎస్సై, కలెక్టరేట్ ౹ వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ౹ సాయిలు, సీనియర్ అసిస్టెంట్ ౹ నాగరాజు, వార్డెన్, కామారెడ్డి ౹ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్, సోమారంతండా ౹ ప్రభాకర్, పారిశుధ్య కార్మికుడు, బీబీపేట ౹ హర్ష, కలెక్టరేట్ ఉద్యోగిని

రూ.వెయ్యి కోట్లతో ఎల్లారెడ్డిని అభివృద్ధి చేస్తా

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని రూ.1000 కోట్లతో అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డికి నెల రోజుల్లోనే రూ. 10 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని, మరో రూ. 60 కోట్లు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ నుంచి మంజూరు కానున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, తహసిల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీపీ మాధవి, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో ఇటీవల నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులతో కలిసి ఆయన కొబ్బరికాయలు కొట్టారు. సర్పంచ్ వంజరి సునీత, ఉపసర్పంచ్ దుర్గేశ్ వార్డుసభ్యులతో కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు. దీంతోపాటు గ్రామంలోని 2వ వార్డులో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు మండల పరిషత కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ఎంపీపీ రాజ్‌దాస్ శాలువాతో సత్కరించారు. మండల పరిషత్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి, గోపాల్‌పేట సర్పంచ్ వంజరి సునీత, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్ తదితరులున్నారు.



ఎల్లారెడ్డిలో షాదీముబారక్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

వరంగల్‌లో లైన్‌మన్‌కు అవార్డు అందజేత

నిజామాబాద్‌నాగారం: వరంగల్‌లోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. వేడుకల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన డి-2 సెక్షన్ పరిధిలోని లైన్‌మన్ పల్లికొండ సాయికుమార్‌కు సీఎండీ వరుణ్‌రెడ్డి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించారు.



క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రభాకర్(ఫైల్)

మోపాల్: మండలంలోని తాడెంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడెంకు చెందిన వేల్పూర్ ప్రభాకర్ (55) స్థానిక సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన అనిల్ బైక్‌పై వేగంగా ప్రభాకర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబీకులు అనిల్‌పై దాడికి యత్నించి, వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరు..

సదాశివనగర్: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మర్రి ఆశిరెడ్డి(49) తన పంట పొలంలో నీరు పారించేందుకు ఉదయం వెళ్లగా కాలుజారి కాలువలో ఉన్న బురదలో పడడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రాధవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

మాక్లూర్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోని గేటు తాళాలను దుండగులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు.ఆలయంలో అమ్మవారిపై ఉన్న 6 గ్రాముల బంగారం, వెండి కళ్లు, హుండీ నగదును దొంగిలించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పొతంగల్ మండలం కొల్లూర్‌లో రెండు చోట్ల పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. దాడిలో గ్రామ శివారులో ఆడుతున్న వారి నుంచి రూ.8440, చెరువు వద్ద రూ. 11,210 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పేకాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



మాక్లూర్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని మాదాపూర్ శివారులో కృతిమ ఇసుక డంప్‌పై శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో అనుమతి లేకుండా తరలిస్తున్న 4 ఇసుక టిప్పర్లు, రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మాదాపూర్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐలు శంకర్ భూషణ్,అజయ్‌బాబు, సిబ్బంది సుధాకర్ ఉన్నారు.

రేషన్ బియ్యం..

లింగంపేట: మండలంలోని మెంగారంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. మెంగారం శివారులో శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా రేష న్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గు ర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. యాదాద్రి జిల్లా బొమ్మలరామారం గ్రామం నుంచి బియ్యాన్ని ఎల్లారె డ్డి వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫారెస్ట్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఆజం 1.315 కిలోల ఎండు గంజాయిని విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం గంజాయిని సీజ్ చేసి షేక్ ఆజంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో వెంట ఎస్సై మల్లేశ్, సిబ్బంది షబ్బీర్, ప్రభాకర్, సంగయ్య, రవి, సంజయ్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

లింగంపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ శుక్రవా రం తెలిపారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవ లు జరుగుతున్నాయని ఈ క్రమంలో ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మేకల కాపరి ..



మైసయ్య

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లికి చెందిన మేకల కాపరి మైసయ్య అదృశ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. మైసయ్య గురువారం ఉదయం మేకలను తీసుకొని అడవికి వెళ్లగా రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతంగా కౌలాస్ అభివృద్ధి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: కౌలాస్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. కోటపై జాతీయ జెండాను ఆవిష్కరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా న్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జుక్కల్ మండలం కౌలాస్‌లోని ఖిల్లాపై ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పురాతన చరిత్ర గల కౌలాస్ కోటలో కట్టడాలు ఆకట్టుకునేలా ఉన్నాయని చెప్పారు. కోట చరిత్రను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. మూడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న కౌలాస్ కోట రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. కౌలాస్ కోట వారసులు అనితాసింగ్, కాంగ్రెస్ నాయకులు అస్పత్‌వార్ వినోద్, విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మద్నూర్ అభివృద్ధికి కృషి

మద్నూర్(జుక్కల్) : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని తహసీల్ కార్యలయం వద్ద నిర్వహించిన గణతంత్ర్య వేడుకలలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విఠల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలి

బాన్సువాడ : ప్రతిఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తి తో పనిచేయాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పో చారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోతంత్ర దినోత్సవాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద మొదటిసారిగా జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ బాన్సువాడలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నిర్మించుకున్న తర్వాత మొదటి సారి జెండాను ఎగరవేశానని, ప్రతిసారి అసెంబ్లీలో, జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఎగరవేశానన్నారు. రాష్ట్రంలో కోటి కుటుంబాలున్నాయని, వాటిలో 93 లక్షల మందికి రేషన్ కార్డులున్నాయని, ఇంకా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, చాలామంది రేషన్ కార్డుల కోసం మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారని, రేషన్ బియ్యం తీసుకుని అమ్మేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎంపిపి నీరజావెంకట్‌రాంరెడ్డి, జెట్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, నాయకులు అంజిరెడ్డి, మోహన్‌నాయక్, కృష్ణ రెడ్డి, పాతబాలకృష్ణ, రుక్మిణి, తార, రమాదేవి, దాసరి శ్రీనివాస్, గంగుల గంగారం, ఎజాస్, బాబా తదితరులు ఉన్నారు.



బాన్సువాడలో జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

చదువును కొనసాగించాలి

బాన్సువాడ రూరల్ : విద్యార్థినులు ఎస్సెస్సీ, ఇంటర్ తర్వాత చదువులు మధ్యలో ఆపకుండా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, నర్సింగ్, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడలోని బోర్లంరోడ్డులో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ ధనలక్ష్మిని అభినందించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మాజిద్, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, సర్పంచ్ సరళ, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, ఎర్వాల కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు





జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలో గణతంత్ర దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సింధు శర్మ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువలో గాలింపు చర్యలు

బాల్కొండ: మండలంలోని బోదెపల్లికి చెందిన గడ్డం చిన్న సాయన్న గురువారం వరద కాలువలో గల్లంతయ్యాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు గురువారం రాత్రి 7 నుంచి శుక్రవారం సాయంత్రం 5 వరకు నీటి విడుదలను నిలిపివేసినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధిత కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.